నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శనివారం 11 జనవరి 2025 | BHADRADRI KOTHAGUDEM


పది అడుగుల లోతులో తీసిన కాలువను పరిశీలిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

మట్టి మాఫియాకు అధికారుల ప్రోత్సాహం

- కట్టడి చేయాల్సిన వారే కాంట్రాక్టర్లకు కొమ్ము కాస్తున్నారు
- అక్రమ మట్టి తవ్వకాల పరిశీలనలో జడ్పీ మాజీ చైర్మన్
- కాలువలో మట్టి తోలకాలను అడ్డుకున్న బీఆర్ఎస్ నేతలు

మధిర, జనవరి 10: మట్టి మాఫియాను అధికారులు ప్రోత్సహిస్తున్నారని జడ్పీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు మండిపడ్డారు. అక్రమాలను కట్టడి చేయాల్సిన అధికారులే కాంట్రాక్టర్లకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ అనుబంధ రైతు సంఘం నాయకులతో కలిసి మధిర మండలం వంగవీడు గ్రామంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. అక్కడి ఎన్నెస్పీ కాలువలోని మట్టిని కాంట్రాక్టర్లు పొక్లెయిన్ ద్వారా తరలిస్తున్న విషయాన్ని గమనించారు. అలా తరలిస్తున్న లారీలను, పొక్లెయిన్‌ను నాయకులు అడ్డుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా కమల్‌రాజు మాట్లాడుతూ.. సిరిపురం – వంగవీడు గ్రామాల మధ్య గల ఉపయోగం లేని సాగర్ పంట కాలువలో కాంట్రాక్టర్లు మట్టిని తొవ్వుతున్నారని అన్నారు. రెండు, మూడు అడుగుల మేర ఉన్న కాలువను ఏకంగా 10 అడుగుల లోతులో తొవ్వుతున్నారని, రైతుల పంట పొలాలను ధ్వంసం చేస్తూ లారీల ద్వారా ఆ మట్టిని తరలిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా అధికారులు పట్టించుకోకుండా కాంట్రాక్టర్లను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఒకవైపు తమది రైతు ప్రభుత్వమంటూ చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో స్వయంగా డిప్యూటీ సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న మధిరలో దళిత రైతులకు ఇంతటి అన్యాయం జరుగుతుండడం దారుణమని వాపోయారు. ఇలాంటి అధికారులపై కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకొని అక్రమ మట్టి తోలకాలను నిలిపివేయాలని కోరారు. బీఆర్ఎస్ నేతలు, అనుబంధ రైతు సంఘం నాయకులు చిత్తారు నాగేశ్వరరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, అరిగె శ్రీనివాసరావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, ఉమామహేశ్వరరెడ్డి, కొత్తపల్లి నరసింహారావు, చీదిరాల రాంబాబు, నాగులవంచ రామారావు, వేల్పుల శ్రీనివాస్, బొగ్గుల వీరారెడ్డి, నరసింహారెడ్డి, ఓబుల ఆదినారాయణరెడ్డి, దర్శి నాగేశ్వరరావు, మోదుగు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సెలవులకు ఊరెళితే జర జాగ్రత్త!

దూర ప్రాంతాలకు వెళితే ఠాణాల్లో వివరాలు ఇవ్వండి: భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం క్రైం, జనవరి 10: సంక్రాంతి సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు పాటించాలని భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. పండుగ సందర్భంగా దూర ప్రయాణాలు చేసేవారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తమ ఇంటి నెంబర్, ఫోన్ నెంబర్ ఇవ్వాలని సూచించారు. తద్వారా వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసి ఆయా ఇళ్ల పరిసర ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ఊర్లకు వెళ్లేవారు బీరువా తాళాలు తమ వెంట తీసుకెళ్లాలని, ఇంటికి తాళం వేసిన తర్వాత అది కనిపించకుండా డోర్ కర్టెన్ వేయాలని సూచించారు. ప్రజలు తమ కాలనీలు, ఇళ్లు పరిసరాలు, షాపింగ్ మాల్స్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇంట్లో సీసీ కెమెరా ఉన్నవారు ఎప్పుటికప్పుడు వాటిని పరిశీలించాలని, దొంగతనాలకు తావులేకుండా పోలీస్ శాఖ ఇచ్చిన సూచనల మేరకు తగు జాగ్రత్తలు పాటించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

- పుంజులతో సిద్ధమవుతున్న జూదరులు
- సరిహద్దు ఆంధ్రా గ్రామాలకు పయనం
- తెలంగాణలో నిషిద్ధం.. పోలీసుల నిఘా
- రూ.లక్షలు పోగొట్టుకుంటున్న వ్యసనపరులు

సంక్రాంతి సంబురాలు షురువయ్యాయి. సంప్రదాయ క్రీడ కోడిపందేలకు పందెంరాయుళ్లు సయ్యంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో నిషేధం ఉండడంతో పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ గ్రామాలకు పయనమయ్యారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో పందెం బర్రులు సిద్ధం చేస్తున్నారు. జూదరులను ఆకర్షించేందుకు నిర్వాహకులు కోడిపందేలతో పాటు మద్యం, బిర్యానీ పాయింట్లు, ఇతర జూదాలు ఏర్పాటు చేస్తున్నారు. పందేల వ్యసనంతో జూదరులు ప్రతి సంక్రాంతికి రూ.లక్షలు పోగొట్టుకోవడం పరిపాటిగా మారింది. తెలంగాణ పోలీసులు ఆంధ్రా సరిహద్దులో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేసి జూదానికి అడ్డుకట్ట వేస్తారో లేదో వేచిచూద్దాం. –భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ అశ్వారావుపేట/ సత్తుపల్లి టౌన్, జనవరి 10

ఆంధ్రా సరిహద్దుల్లో పందెంకోళ్లు

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు

సంప్రదాయ ముసుగులో కోడిపందేలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే నాన్ బెయిలబుల్ కేసులు పెడతాం. కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు మండలాల్లోని కోడిపందేల నిర్వాహకులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చాం. ఎక్కడైనా కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే ప్రజలు వెంటనే 100 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలి. సమాచారం చెప్పిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

–రఘు, కల్లూరు ఏసీపీ

తెలంగాణ రాష్ట్రంలో కోడిపందేల నిషేధం కఠినంగా అమలవుతుండడంతో జూదరులు ఆంధ్రా వైపు పరుగులు తీస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలైన అశ్వారావుపేట, సత్తుపల్లికి ఆంధ్రా సరిహద్దు మండలాలు ఎక్కువగా ఉండడంతో ఏ వైపు చూసినా పందెం బర్రులు అందుబాటులో ఉంటున్నాయి. దీంతో కోడిపందేల ప్రియులు సరిహద్దులు దాటి వెళ్తున్నారు. అశ్వారావుపేటకు ఏలూరు జిల్లా జీలుగుమిల్లి, టి.నర్సాపురం, చింతలపూడి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల సరిహద్దులు అత్యంత సమీపంలో ఉంటాయి. ఊరు దాటితే సరిహద్దు మండలాల్లోకి వెళ్లిపోతారు. అందుకే కోడిపందేల కోసం పరుగులు తీస్తారు.

సరిహద్దు గ్రామాల్లో బర్రులు..

జీలుగుమిల్లి మండలం తాటియాకులగూడెం, కామయ్యపాలెం, రామన్నగూడెం, కుక్కునూరు మండలం లంకాలపల్లి, కివ్వాక, దాచారం, కొండపల్లి, వేలేరుపాడు మండలం భూదేవిపేట, బుర్రతోగు, బండ్లబోరు, నాళ్లపరం, టి.నర్సాపురం మండలం మక్కినవారిగూడెం, సీతానగరం, మర్రిగూడెం, జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసాపురం, పట్టెనపాలెం, అక్కంపేట, రెడ్డిగణపవరం, పుల్లేపూడి, చింతలపూడి మండలం శివాపురం, కోటపాడు, గండిపాడు, మల్లాయిగూడెం, ఆముదాలచెలక వంటి గ్రామాల్లో జరిగే కోడిపందేలు స్థానిక జూదరులకు అందుబాటులో ఉన్నాయి.

పుంజుల పెంపకం..

కోడి పందేల కోసం అశ్వారావుపేట, సత్తుపల్లిలో కొందరు వ్యాపారులు పుంజుల పెంపకం చేపడుతున్నారు. అశ్వారావుపేట, సత్తుపల్లి, దమ్మపేట మండలాల్లోనే కనీసం 70కి పైగా కోడిపుంజుల పెంపకం కేంద్రాలు ఉన్నాయి. కుటీర పరిశ్రమగా పందెం పుంజులను విక్రయించుకుంటూ ఉపాధి పొందుతున్నారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా రాష్ట్రాల నుంచి వచ్చి మరీ ఇక్కడ పందెం పుంజులను కొనుగోలు చేస్తారు. పామాయిల్, కొబ్బరి తోటలను ప్రత్యేకంగా ఎంపిక చేసుకుని పందెం పుంజులను పెంచుతారు. ఒక్కో పుంజు ధర రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు ఉంటుంది.

ప్రమాదకరంగా ఇతర జూదాలు..

కోడిపందేల శిబిరాల వద్ద జూదగాళ్లు ఇతర ప్రమాదకరమైన జూదాలు కూడా నిర్వహిస్తున్నారు. అందర్ బాహర్, లోన బయట ఆట అత్యంత ప్రమాదకరమైన జూదం. గంటల్లో లక్షాధికారి బికారిగా, బికార్లు లక్షాధికారులుగా మారుతుంటారు. ఈ జూదానికి అలవాటుపడి అనేక కుటుంబాలు రోడ్డునపడ్డాయి. తెలంగాణ పోలీసులు పండుగకు రెండ్రోజుల ముందు తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు మండలాల నుంచి ఆంధ్రా రాష్ట్రానికి వెళ్లే బోర్డర్ల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తే జూదాన్ని కొంతవరకు కట్టడి చేయవచ్చు.


పందేలకు సిద్ధం చేసిన కత్తులు

గోదారి తీరంలో.. పర్యాటక ప్రదేశాలు

- రెయిన్ వాటర్ ప్రాజెక్టు బృందం సభ్యులు
- కలెక్టర్, పీవో ఆదేశాల మేరకు పర్యటన

గిరిజన కళాఖండాలను పరిశీలిస్తున్న బృందం ప్రతినిధులు

భద్రాచలం, జనవరి 10: గోదావరి తీర ప్రాంతంలో పలు పర్యాటక ప్రదేశాలను గుర్తించినట్లు రెయిన్ వాటర్ ప్రాజెక్టు బృందం, స్టూడియో పంచతంత్ర బృందం సభ్యులు తెలిపారు. కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్ ఆదేశాల మేరకు రెయిన్ వాటర్ ప్రాజెక్టు ఫౌండర్ సీఈవో కల్పనా రమేశ్ బృందం సభ్యులతో కలిసి శుక్రవారం భద్రాచలంలోని గిరిజన మ్యూజియంలోని కళాఖండాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులు వారి సంస్కృతీ సంప్రదాయాలకు సంబంధించి పాత కాలపు కళాఖండాలను ఎగ్జిబిషన్ రూపంలో పర్యాటకులకు చూపడమే కాకుండా వాటి విక్రయాల ద్వారా ఉపాధి పొందాలన్నారు. రాజుల కాలం నాటి కట్టడాలు, దిగుడు బావులు, మెట్ల బావులు వాడకంలో లేకపోవడంతో చెత్తాచెదారంతో నిండిపోయాయని, వాటిని వినియోగంలోకి తెచ్చుకోవాలని గ్రామస్తులకు సూచించామన్నారు. పర్యాటకానికి అనువుగా ఉన్న భద్రాద్రి జిల్లాలోని గ్రామాలను కలెక్టర్, ఐటీడీఏ పీవో సూచన మేరకు స్థలాలను గుర్తించామన్నారు. కార్యక్రమంలో బృంద సభ్యులు నిహారిక, శ్రావణి, ఆదిత్య, ప్రాజెక్టు మేనేజర్ వెంకటేశ్, పంచతంత్ర బృందం సభ్యులు, మ్యూజియం ఇన్‌చార్జి వీరాస్వామి పాల్గొన్నారు.

'ముక్కోటి'దీ మొక్కొక్కటే..

భద్రాచలం రామాలయ ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిస్తున్న రామయ్య

- ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన భద్రాద్రి రామయ్య
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు

భద్రాచలం, జనవరి 10: తెల్లవారుజామునే వేద పండితుల మంత్రోచ్చారణలు. వేలాదిగా తరలివచ్చిన భక్తుల ఎదురుచూపులు. ఆ అమృత ఘడియ రానే వచ్చింది. అపురూప ఘట్టం ఆవిష్కృతమైంది. అలంకృతుడైన భద్రాద్రి రామయ్య వైకుంఠ ఏకాదశి అధ్యయన మహోత్సవాల్లో భాగంగా ఏకాదశి రోజున ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఒక్కసారిగా జయజయ ధ్వానాలు.. 'జై శ్రీరామ్ జైజై శ్రీరామ్' అంటూ భక్తిభావంతో నినాదాలు. శుక్రవారం తెల్లవారుజామున పవిత్ర పావన గోదావరి నదీతీరం నుంచి అర్చకులు తీర్థపు బిందెను తీసుకొచ్చారు. ఆలయ సంప్రోక్షణ చేసిన తర్వాత స్వామివారికి ఆరాధన, ఆరగింపు చేశారు. సంప్రదాయబద్ధంగా తహసీల్దార్‌కు ఆలయ మర్యాదలు చేశారు. పూలతో అలంకరించిన గరుడ వాహనంపై శ్రీరాముడు, గజవాహనంపై సీతమ్మ వారు, హనుమత్ వాహనంపై ఆంజనేయ స్వామి, మరికొన్ని వాహనాలపై ఆండాళ్లు అమ్మవారు, ఆళ్వార్లను ఆశీనులను చేసి ఊరేగింపుగా ఉత్తర ద్వారం వద్దకు తీసుకొచ్చారు. అయితే వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు ఉత్తర ద్వారం వద్దకు చేరుకుని స్వామివారి దర్శనం కోసం వేచిచూస్తున్నారు. ఈలోగా ఘల్లుఘల్లు మంటూ గంటలు మోత మోగుతుండగా.. భాజాభజంత్రీల సందడి.. వేదపండితుల మంత్రోచ్ఛరణలు మిన్నంటుతుండగా ఒక్కసారిగా ఆలయ ఉత్తర ద్వారం తెరుచుకున్నది. స్వామివారిని తనివితీరా వీక్షించిన భక్తులు తన్మయత్వానికి లోనయ్యారు. శ్రీరామ.. జయ రామ.. జయజయరామ అంటూ ఆధ్యాత్మిక సంద్రంలో మునిగితేలారు. వేదపండితులు, అర్చకులు విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, తిరువారాధన, వేదవిన్నపం, శ్రీరామసంపుటి పఠించారు. ఆద్యంతం ఈ వేడుకను కనులారా తిలకించిన భక్తజనం పులకించిపోయారు. అనంతరం స్వామివారిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. ఉదయం 11 గంటల సమయంలో స్వామివారికి తిరువీధి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్ కలెక్టర్లు జితేశ్ వి పాటిల్, ప్రతీక్ జైన్, ఎస్పీ రోహిత్‌రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, ఆర్డీవో దామోదరరావు, ఆలయ ఈవో రమాదేవి, ఈఈ రవీందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కూడా ముక్కోటి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.

పోలీసు స్టేషన్ గోడకు అమర్చిన క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పీఎస్‌లలో 'క్యూఆర్' కోడ్

పోలీస్ శాఖ సేవలపై ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాటు

కొత్తగూడెం క్రైం, జనవరి 10: పోలీసుల పని తీరుతో మీరు సంతృప్తికరంగా ఉన్నారా..? అసంతృప్తిగా ఉన్నారా..? ఏదైనా సరే. మీరు నేరుగా మీ అభిప్రాయాలను చెప్పేందుకు ఇప్పుడు అవకాశముంది. పోలీస్ సర్కిల్, డీఎస్పీ కార్యాలయాల్లోని 'క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజన్' పేరుతోగల కోడ్‌ను స్కాన్ చేసి, మీరు చెప్పదలచుకున్నది తెలపవచ్చు. ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాలు.. 'జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో, సర్కిల్–డీఎస్పీ–ఎస్పీ కార్యాలయాల్లో ఈ క్యూఆర్ కోడ్ పోస్టర్ అందుబాటులో ఉంటుంది. ఈ క్యూఆర్ కోడ్‌ను గురువారం ఎస్పీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ లాంఛనంగా ఆవిష్కరించారు. బాధితులు తమ సమస్యలను తెలుపుకునేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లినప్పుడు అక్కడి అధికారులు/ సిబ్బంది వ్యవహరించిన తీరు, ఫిర్యాదులపై స్పందన, పాస్‌పోర్ట్ వెరిఫికేషన్, ఈ–చలాన్, ఎఫ్ఐఆర్ తదితర అన్ని రకాల సేవలపై స్పందనను, అభిప్రాయాలను సేకరించేందుకు ఈ క్యూఆర్ కోడ్ అందుబాటులోకి వచ్చింది. ఈ కోడ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, పోలీసుల పనితీరుపై సలహాలు, సూచనలు ఇవ్వాలి'.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు..

పటిష్ట చర్యలు: అదనపు కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం, జనవరి 10: రోడ్డు భద్రతా ప్రమాణాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వద్ద తప్పనిసరిగా స్కూల్ జోన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతీయ రహదారులపై అధికంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, అత్యవసర వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగినప్పుడు 1033కు ఫోన్ చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వంలోని డ్రైవర్లు, ఆర్టీసీ డ్రైవర్లకు సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో రోడ్లపై ఆక్రమణలను తొలగించాలన్నారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ హేమలత, డీపీవో ఆశాలత, డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి, ఆర్టీవో వెంకటరమణ, ఏసీపీ శ్రీనివాసులు, విద్యాశాఖ ఆర్ ఎంవో రాజశేఖర్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంబాబు, లారీ ఓనర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రఘురాం ప్రసాద్ పాల్గొన్నారు.

నిధుల్లేవు.. నిర్వహణ ఎలా?

- 'పాలెం' తహసీల్ ఆఫీసులో ఓ అధికారి నిరుత్సాహం
- ఆఫీసు మెయింటెనెన్స్ ఫండ్స్ లేవంటూ అసంతృప్తి
- ప్రభుత్వంపై ప్రజల్లోనే కాదు.. అధికారుల్లోనూ అసహనం

రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయం (ఫైల్)

'ఆర్నెళ్లుగా కరెంటు బిల్లు కట్టడం లేదు.. ఎప్పుడు విద్యుత్ అధికారులు వచ్చి విద్యుత్ సరఫరా నిలిపివేస్తారో కూడా తెలియదు.. ఆఫీస్ ఇంటర్నెట్ పరిస్థితీ అంతే.. ఇక స్టేషనరీ సంగతి దేవుడెరుగు.. కార్యాలయం నిర్వహణకు ఫండ్స్ లేక ఇబ్బందులు పడుతున్నం.. ఎవరికి చెప్పుకోవాలి.. ఏం చేయాలి..' ఇవి రఘునాథపాలెం తహీల్దార్ కార్యాలయానికి చెందిన ఓ అధికారి అసంతృప్తితో అన్న మాటలు. వివరాల్లోకెళ్తే.. ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు ప్రభుత్వమే కొన్ని నిధులను కేటాయిస్తుంది. కానీ గత కొన్ని నెలలుగా మెయింటెనెన్స్ డబ్బులు విడుదల చేయకపోవడంతో అధికారులు నిరుత్సాహానికి గురవుతున్నారు. కాంగ్రెస్ సర్కార్‌పై సాధారణ ప్రజల్లోనే కాదు.. ప్రభుత్వ అధికారుల్లోనూ అసంతృప్తి జ్వాలలు రేకెత్తుతున్నాయి. ప్రభుత్వ పాలనను ప్రజలే కాదు.. ప్రభుత్వ అధికారులూ ఈసడించుకుంటున్నారు. ఇందుకు రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయంలో ఓ అధికారి ఆఫీస్ నిర్వహణ తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేయడమే ప్రత్యక్ష నిదర్శనం. చెప్పుకుంటే సిగ్గుచేటు అంటూ.. ఫండ్స్ లేకపోవడంతో విధి నిర్వహణలో నిత్యం ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో తెలియక ఇబ్బంది పడుతున్న వైనం ఆ అధికారి మాటల్లో కనిపించింది. గతంలో ఏ ప్రభుత్వ కార్యాలయంలో ఇలాంటి పరిస్థితి లేదని.. కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంకనే ఇలా దాపురించిందని కార్యాలయానికి చెందని ఒకరిద్దరి నోట వినిపించింది.

–రఘునాథపాలెం, జనవరి 10

ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ముట్టడి

- ఇల్లెందు, భద్రాచలం, దమ్మపేటల్లో ఆశా కార్యకర్తల ఆందోళన
- సమస్యలు పరిష్కరించాలని, హామీలు నెరవేర్చాలని డిమాండ్

ఇల్లెందు/ భద్రాచలం/ దమ్మపేట రూరల్, జనవరి 10: సమస్యలు పరిష్కరించాలని, హామీలు నెరవేర్చాలని ఆశా కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు భద్రాద్రి జిల్లాలోని ఇల్లెందు, భద్రాచలం, దమ్మపేటల్లో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు, ఇళ్లను శుక్రవారం ముట్టడించారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఆయా పట్టణాల్లో భారీ ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రూ.18 వేల కనీసం వేతనం ఇవ్వాలని, ఏఎన్ఎం ట్రైనింగ్ పూర్తి చేసిన వారికి ప్రమోషన్ కల్పించాలని, రూ.50 లక్షల బీమా ఉత్తర్వులు జారీ చేయాలని, ఆదివారాలు, పండుగ రోజుల్లో సెలవులు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు చెల్లించాలని, ప్రసూతి సెలవులు ఇవ్వాలని, మెడికల్ లీవులు మంజూరు చేయాలని, పనిభారం తగ్గించాలని, పెండింగ్ గౌరవ వేతనాలు వెంటనే చెల్లించాలని, ఆసుపత్రుల్లో రెస్టు రూంలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అయితే.. జిల్లా, రాష్ట్రస్థాయిలో అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులను కలిసి సమస్యలు విన్నవించినా నేటికీ ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఇల్లెందు, భద్రాచలంలలో ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావుల క్యాంపు కార్యాలయాల ఎదుట ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు